దివ్యాంగులకు చేయూతనివ్వాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శంకర్‌

రాజేంద్రనగర్‌: జీహెచ్‌ఎస్‌ రాజేంద్రనగర్‌ భవిత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ కె.శంకర్‌, జీహెచ్‌ఎస్‌ ప్రిన్సిపాల్‌, ప్రధానోపాధ్యాయురాలు సుగుణ, పాఠశాల సిబ్బంది శ్రీనివాస్‌, యాదగిరి, సీతయ్య, హనుమంతు రావు, బాబురావు, స్పెషల్‌ టీచర్స్‌ లక్ష్మీ, స్వప్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగుల పట్ల ప్రజలు వివక్ష చూపకుండా వారికి చేయూతనిచ్చి ఆసరాగా నిలవాలని కోరారు.

నేడు టీ-హబ్‌ ఫౌండేషన్‌ డే



రాయదుర్గం: హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో 9వ ఫౌండేషన్‌ డేను శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. టీహబ్‌ ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే వ్యవస్థాపక దినోత్సవంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సైయంట్‌ వ్యవస్థాపక చైర్మన్‌ బీవీఆర్‌ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌, టీహబ్‌ తాత్కాలిక సీఈఓ సుజిత్‌ జాగిర్దార్‌ పాల్గొంటారని టీహబ్‌ అధికారులు తెలిపారు. టీహబ్‌ 9వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని డిఫెన్స్‌, ఏరోస్పేస్‌ రంగాలకు అంకితమైన అత్యాధునిక ఆవిష్కరణలకు వేదికగా 'టీ డ్రైవ్‌'ను ప్రారంభిస్తారు.అలాగే కార్పొరేట్లు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ వాటాదారులతో సహకారాన్ని ప్రోత్సహించే ఇంటరాక్టివ్‌ డిజిటల్‌ డిస్‌ప్లేలను అందిస్తూ, 20కి పైగా స్టార్టప్‌లనుంచి సంచలనాత్మక పరిష్కారాలను ప్రదర్శించడా నికి రూపొందించబడిన అత్యాధునిక సదుపాయంగా అనుభవ కేంద్రం 2.0ను ప్రారంభిస్తారు. ఇంకా మెరిడియన్‌ డేటా ల్యాబ్స్‌, తేనె గూడు, రక్షణ, స్మార్ట్‌ నగరాల వంటి పరిశ్రమల కోసం జెన్‌ఏఐ-నడిచే వేదికను ప్రారంభిస్తారు.

సర్కారు వైద్యం.. పేదలకు దూరం!

'బస్తీ' దరిచేరని 'దవాఖానా'లు

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- వ్యాధులు ప్రబలుతున్నా స్పందించని వైనం
- వైద్యం అందక ఆందోళనలో పేదలు



నెక్నాంపూర్‌, పుప్పాలగూడలలో నిరుపయోగంగా ఉన్న బస్తీ దవాఖానాల భవనాలు



మణికొండ: పేదలకు సర్కారు వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన బస్తీ దవాఖానాలు ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. ప్రారంభమైన వాటి పరిస్థితి ఇలా ఉంటే ప్రారంభానికి నోచుకోని పలు బస్తీ దవాఖానాలు మాత్రం అలంకారప్రాయంగా తయారయ్యాయి. వివరాలివీ... ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని ఉచితంగా స్థానికంగానే అందించాలనే సదుద్దేశంతో గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మున్సిపాలిటీలు, డివిజన్‌ల వారీగా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలనుకుంది. అందులో భాగంగా కొన్నింటిని ప్రారంభించగా మరికొన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి వచ్చిన వస్తున్న డిమాండ్‌తో ఆయా ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయాలని మరోసారి ప్రతిపాదలను పంపారు. ఈ క్రమంలో అవి మంజూరై ప్రారంభించాలనుకునే సమయంలోనే ఎన్నికల కోడ్‌ వచ్చింది. దీంతో ఆ బస్తీదవాఖానాల ప్రారంభోత్సవాలు కాస్తా వాయిదా పడ్డాయి. ఎన్నికల అనంతరం కొత్తగా కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా ఇప్పటికీ ఆయా బస్తీ దవాఖానాలు ప్రారంభానికి నోచుకోలేదు. వెరసి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించిన భవనాలు కాస్తా నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఎప్పుడు ప్రారంభిస్తారు... తమకు ఉచిత వైద్యం ఎప్పుడు అందిస్తారో అని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

తగ్గిన సిబ్బంది...

గండిపేట మండల పరిధిలోని 12 బస్తీ దవాఖానాలకు అవసరమైన డాక్టర్లు, స్టాఫ్‌ నర్స్‌లు, అటెండర్‌లను అప్పట్లో ప్రభుత్వం నియమించింది. వాటిలో 8 బస్తీ దవాఖానాలు పనిచేయటం ప్రారంభించాయి. మిగతా నాలుగు ప్రారంభోత్సవాలకే నోచుకోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖలో రెగ్యులర్‌ ఉద్యోగుల నియామకాలు చేపట్టడంతో కొందరికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చి ఇతర ప్రాంతాలకు పోస్టింగ్‌లపై వెళ్లారు. దాంతో గండిపేట మండల పరిధిలో డాక్టర్‌లతో పాటు సిబ్బంది తగ్గిపోయారు. ప్రస్తుతం ప్రారంభించాల్సిన నాలుగు బస్తీ దవాఖానాలకు కొత్తగా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

- గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ముందుగా మున్సిపాలిటీకి ఒకటి చొప్పున బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వాటిని మణికొండ, ఖానాపూర్‌, హైదర్‌షాకోట్‌లలో ప్రారంభించింది. అనంతరం తమ ప్రాంతాల్లోనూ బస్తీ దవాఖానాలు కావాలని ప్రజల నుంచి డిమాండ్‌ రావటంతో వాటిని ఏకంగా 12కి పెంచింది. అందులో ముందుగా ప్రారంభమైన మూడింటితో పాటు కోకాపేట, కిస్మత్‌పూర్‌, గంధంగూడ, సన్‌సిటీలోని పీఅండ్‌టీ కాలనీ, చిత్రపురి కాలనీలలో మరో ఐదింటిని ప్రారంభించింది. వాటితో మొత్తం 8 బస్తీ దవాఖానాలు ప్రారంభమయ్యాయి. మరో విడతగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్‌, పుప్పాలగూడ, నెమలినగర్‌, బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ఖలీజ్‌ఖాన్‌ దర్గాలలో మరో నాలుగు మంజూరు చేసి వాటి సంఖ్యను ఏకంగా 12కు పెంచింది.
- గండిపేట, వట్టినాగులపల్లి గ్రామాల్లోనూ డిమాండ్‌ రావటంతో వాటికీ ప్రతిపాదనలను తెప్పించుకుంది.

ప్రారంభోత్సవాలకు నోచుకోని భవనాలు...

మూడవ విడతలో ఎన్నికల కోడ్‌ రాక ముందు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్‌, పుప్పాలగూడ, నెమలినగర్‌, బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ఖలీజ్‌ఖాన్‌ దర్గాలలో అప్పటికే భవనాలను సిద్ధం చేశారు. వాటికి అవసరమైన సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కాంట్రాక్ట్‌ పద్ధతిలో నియమించింది. ఎన్నికలు ముగిసి ప్రభుత్వం మారటంతో వాటి ప్రారంభోత్సవాలను గాలికి వదిలేసింది. దీంతో ఆయా గ్రామాలలో భవనాలు నిరుపయోగంగా తయారయ్యాయి. దర్గాఖలీజ్‌ఖాన్‌, నెమలినగర్‌ భవనాల్లో ఫర్నిచర్‌ ఏర్పాటు చేయాల్సి ఉండగా మిగతా రెండింటిలో ఫర్నిచర్‌ ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

గండిపేట మండల పరిధిలో నాలుగు బస్తీ దవాఖానాలు ప్రారంభించాల్సి ఉంది. వాటిలో పుప్పాలగూడ, నెక్నాంపూర్‌ల దవాఖానాలు సిద్ధంగా ఉన్నాయి. గతంలో ఉన్న డాక్టర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చి వెళ్లారు. ప్రస్తుతం కాంట్రాక్ట్‌ పద్ధతిలో పనిచేసేందుకు వారిని తీసుకునేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారు రాగానే ఆయా దవాఖానాలు ప్రారంభిస్తాం. అంతలోపు ప్రజలు తమకు సమీపంలో ఉన్న మరో బస్తీ దవాఖానాలో వైద్య సేవలను వినియోగించుకోవాలి.

– సత్యరత్న, మండల వైద్యాధికారి, గండిపేట

భవనాలు సిద్ధం



బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. అవి మంజూరు కాగానే ఉన్న భవనాలతో పాటు కొత్తవి నిర్మించి ప్రారంభించేందుకు సిద్ధం చేశాం. అంతలో ఎన్నికల కోడ్‌ రావటంతో పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే వాటిని ప్రారంభించేందుకు అధికారులతో మాట్లాడతాను. కొత్తవి మూడు ప్రారంభిస్తే మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఐదు బస్తీ దవాఖానాలతో ప్రజలకు మేలు జరుగుతుంది.

– కె.నరేందర్‌ముదిరాజ్‌, మున్సిపల్‌ చైర్మన్‌, మణికొండ

త్వరలో ప్రారంభిస్తాం



గండిపేట మండల పరిధిలో జనాభా అవసరాలకు అనుగుణంగా బస్తీ దవాఖానాలు ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో గ్రామానికి ఒకటి చొప్పున మంజూరు చేయించాను. వాటిలో ఎనిమిదింటిలో ప్రజలకు వైద్య సేవలు అందుతుండగా మరో నాలుగు ప్రారంభించాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న వాటికి అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించాలని జిల్లా వైద్యాధికారికి విజ్ఞప్తి చేస్తా. నియామకం పూర్తికాగానే ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలందించేలా చూస్తాము.

– టి.ప్రకాశ్‌గౌడ్‌, ఎమ్మెల్యే, రాజేంద్రనగర్‌

పరిసరాల పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌

బండ్లగూడ: ప్రజలు తాము ఉంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర, కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నేత గోకరి సురేష్‌గౌడ్‌ అన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని 18వ డివిజన్‌లో ప్రజా పాలన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. వీరబ్రహ్మేంద్రస్వామి కాలనీ, జాహ్నవి ఎన్‌క్లేవ్‌లలో పార్కుల స్థలాలు, కమ్యూనిటీ హాల్‌ స్థలాలను శుభ్రం చేయించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న జాన్‌ వెస్లీ

మైలార్‌దేవ్‌పల్లి: సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వంపై పోరాటం చేసే ప్రజలకు అండగా సీపీఎం పని చేయాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌ వెస్లీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం కాటేదాన్‌లోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజలు, కార్మికులకు సీపీఎం అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారం అయ్యేదాకా అవిశ్రాంత పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం సంపూర్ణంగా ఆరు గ్యారంటీలను అమలు చేసి పేద ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి జి.ఎం. కురుమయ్య, మండల కమిటీ సభ్యులు ఎస్‌.జంగయ్య, జి.ఎం.గట్టయ్య, ఎస్‌.మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

రాజేంద్రనగర్‌: బీఆర్‌ఎస్‌ మాజీ మంత్రులు, ఎమ్మెల్యే అరెస్టు అక్రమమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నేతలు రాజేంద్రనగర్‌ సర్కిల్‌ డైరీఫామ్‌ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ రాజేంద్రనగర్‌ అధ్యక్షుడు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్‌ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తుందని.. ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రతిపక్ష నేతలు, ఎమ్మెల్యేలను అరెస్ట్‌ చేయడం హేయమైన చర్య అన్నారు. సమస్యలపై పోరాడే వారిని నిర్బంధించడం కాంగ్రెస్‌ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఉద్యమ నాయకుడు పీతంరాజ్‌, బీఆర్‌ఎస్‌వీ ప్రెసిడెంట్‌ కట్టెల మండీ గౌతమ్‌, నేతలు కవ్వగూడెం గిరిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, సారంగపాణి, కమల్‌, మహమ్మద్‌ ఖాదర్‌, శ్రీధర్‌ రెడ్డి, ఫజల్‌, రామేశ్వర్‌ రెడ్డి, శివ, అశ్వక్‌ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



గోల్కొండ: బస్తీల రూపురేఖలు మార్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. నానల్‌నగర్‌ డివిజన్‌లోని పలు బస్తీల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీల్లోని ఇరుకైన రోడ్లను విస్తరించడంతో పాటు రోడ్లపై రాకపోకలకు అడ్డంగా ఉన్న బోర్లు, నల్లాలను వేరే చోట అమర్చుతామన్నారు. హకీంపేట్‌లోని జియా స్కూల్‌ లేన్‌, ఎస్‌ఎస్‌ఎఫ్‌ కాలనీలోని నూతన విద్యుత్‌ స్తంభాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. ఆయన వెంట మజ్లిస్‌ నాయకులు మజీద్‌ఖాన్‌, ఆలీముద్దీన్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహబూబ్‌ అలీ తదితరులు ఉన్నారు.

కుతుబ్‌షాహీ ప్రాంగణంలో అధికారుల పర్యటన

గోల్కొండ: కుతుబ్‌షాహీ సమాధుల ప్రాంగణంలోని కుతుబ్‌ షాహీ మసీదు పరిసరాలను రాష్ట్ర ఆర్కియాలజీ, పర్యాటక శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రవీంద్రనాయక్‌ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాధుల ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తాచెదారం వేస్తున్నారని గేట్‌ వద్ద ఉండే సెక్యూరిటీ సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని సూచించారు. మసీదు ప్రతినిధి మిర్జా ఎక్బాల్‌ అహ్మద్‌ మాట్లాడుతూ మసీదు ప్రాంగణంలో చెత్తాచెదారంతో పాటు మట్టి కుప్పలు ఉన్నాయని దీన్నివల్ల సమాజ్‌కు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ మసీదు ప్రాంగణంతో పాటు ఇతర ప్రాంతాల్లోని వ్యర్థాలు, మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

లాల్‌ దర్వాజా ఆలయ కమిటీ చైర్మన్‌పై పరువు నష్టం దావా

చార్మినార్‌: ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త ఎల్‌.గోవింద్‌ కుమార్‌ ముదిరాజ్‌ లాల్‌ దర్వాజా సింహవాహిని ఆలయ ప్రస్తుత చైర్మన్‌ సి.రాజేందర్‌ యాదవ్‌పై రూ. 2 కోట్ల పరువు నష్టం దావా వేశారు. తన ఫిర్యాదు మేరకు నాంపల్లిలోని చీఫ్‌ మెట్రోపాలిటన్‌ మెజిస్ట్రేట్‌ కేసు నమోదు చేసి వచ్చే నెల 10న విచారణకు హాజరు కావాలని ఆదేశించినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. ఆలయ స్థలానికి సంబంధించి తాను గతంలో ఫిర్యాదు చేశానని.. దీంతో సంబంధిత రెవెన్యూ అధికారులు చైర్మన్‌కు వివరణ కోరుతూ లెటర్‌ రాశారన్నారు. దీనిపై చైర్మన్‌ బదులిస్తూ తనను వసూల్‌ రాజాగా, ఆర్టీఐ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తూ తన పరువుకు నష్టం కలిగించినందుకు కోర్టును ఆశ్రయించినట్లు గోవింద్‌కుమార్‌ ముదిరాజ్‌ తెలిపారు.

నేడు పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్‌ బండి భాగ్యలక్ష్మీ శ్రీకాంత్‌యాదవ్‌ దంపతులు

శంషాబాద్‌: పట్టణంలోని రాళ్లగూడలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శుక్రవారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఈ నెల 2 తేదీ నుంచే రోజు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నామన్నారు. గురువారం చండీ హవనం, దుర్గా సూక్త హవనం, హిరణ్యాధివాసం, ప్రదోషకాల పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారని వివరించారు. స్థానిక కౌన్సిలర్‌ బండి భాగ్యలక్ష్మీశ్రీకాంత్‌ యాదవ్‌ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం ఆలయంలో బోనాలు సమర్పించే కార్యక్రమంతో పూజలు ముగుస్తాయన్నారని వారు వివరించారు.

ట్రాఫిక్‌ సిగ్నల్‌ను ఆధునికీకరించాలి



ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: దుర్గానగర్‌ చౌరస్తాలోని ట్రాఫిక్‌ సిగ్నల్‌లో ఆరాంఘర్‌ వైపు యూటర్న్‌ సమయాన్ని పెంచాలని బీజేపీ నాయకులు నవారు మురళీధర్‌రెడ్డి ట్రాఫిక్‌ అధికారులను కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజేందర్‌గౌడ్‌ను గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ట్రాఫిక్‌ సిగ్నల్‌లలో సెకన్ల గణన రాకపోవడంతో వాహనదారులు రెడ్‌ సిగ్నల్‌ పడ్డా ముందుకు వస్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారని వివరించారు. ముఖ్యంగా బాబుల్‌రెడ్డినగర్‌ నుంచి ఆరాంఘర్‌ వెళ్లే వారికి సిగ్నల్‌ సంఖ్యలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిగ్నల్‌ సంఖ్యలను ఏర్పాటు చేసి సిగ్నల్‌ సమయం పెంచాలని కోరామని ఆయన వివరించారు. సానుకూలంగా స్పందించిన ఇన్‌స్పెక్టర్‌ రాజేందర్‌గౌడ్‌ మాట్లాడుతూ... సిగ్నల్‌ను పరిశీలించి ప్రమాదాలు జరుగకుండా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు చంద్రశేఖర్‌, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానం నిజమైంది.. ఆమెది హత్యే

- తీవ్రంగా కొట్టి చంపిన భర్త
- డబ్బుల కోసం భార్యపై ఒత్తిడి



భర్త చేతిలో హత్యకు గురైన సుమలత

శంషాబాద్‌: మహిళ అనుమానాస్పద మృతిలో కుటుంబ సభ్యులు అనుమానించినట్లుగా వివాహితది హత్యగా నిర్ధారణ అయ్యింది. పోలీసుల దర్యాప్తుతో పాటు పోస్టుమార్టంలో కూడా ఇదే వెల్లడైనట్లు సమాచారం. మహేశ్వరం మండలం డబిల్‌గూడ గ్రామానికి చెందిన సుమలతను పదేళ్ల కిందట ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన సాయికుమార్‌గౌడ్‌ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న సాయికుమార్‌ తన భార్యను పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని ఒత్తిడి చేయసాగాడు. డబ్బులిస్తే ఇల్లు కట్టుకుందామని చెప్పాడు. భార్య కుటుంబ సభ్యులు తామే దగ్గరుండి ఇల్లు కట్టిస్తామని తెలిపారు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఇటీవల భార్య సుమలత ఆరోగ్యపరంగా కొంత ఇబ్బందులు తలెత్తడంతో దానిని అవకాశంగా మలుచుకుని హత్య చేయాలని పథకం వేశాడు. మంగళవారం అర్ధరాత్రి తీవ్రంగా కొట్టడంతో పాటు గొంతునులిమి హత్య చేసి ఉదయం వరకు గుండెపోటుతో మరణించినట్లు బుకాయించాడు. సుమలత ఆరోగ్యం బాగా లేదని తెలిసిన కుటుంబ సభ్యులు తొలుత ఇది నిజమనినమ్మారు. అంత్యక్రియల సమయంలో శరీరంపై కొన్ని దెబ్బలు కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం చేయించడంతో పాటు సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తే తానే పథకం ప్రకారం హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం సేవించి.. రాయిపై పడి

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మణికొండ: అతిగా మద్యం తాగిన గుర్తు తెలియని వ్యక్తి రాయిపై పడి తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కోకాపేట ట్రిబుల్‌ ఆర్‌ వైన్స్‌ వద్ద 30 నుంచి 35 సంవత్సరాల వయసున్న ఓ వ్యక్తి అతిగా మద్యం సేవించి ఆ మత్తులో రాయిపై పడిపోయాడు. దాంతో అతని తలకు గాయమై ముక్కులోంచి రక్తస్రావం జరిగి అక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఆ వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు నల్లని షార్ట్‌తో పాటు తెలుపు టీ షర్టు వేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని వారు కోరారు.

యువతి అదృశ్యం



శోభాకుమారి

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బిహార్‌ రాష్ట్రం నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన మాలాదేవి, బబ్లూరామ్‌ దంపతులు కాటేదాన్‌ ప్రాంతంలో ఉంటున్నారు. వారు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి శోభాకుమారి(19) అనే కూతురు ఉంది. ఆమె బాదాంపుడ్‌ బిస్కెట్‌ కంపెనీలో కార్మికురాలిగా పని చేస్తుంది. ఈ నెల 2వ తేదీన రాత్రి ఇంటికొచ్చి నిద్రించింది. తల్లిదండ్రులు ఉదయం లేచి చూడగా ఇంట్లో శోభాకుమారి కనిపించ లేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేనందున పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

8న సెమినార్‌

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ప్రత్యేక సెమినార్‌ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఆదివారం నిర్వహించే సండే ఈవినింగ్‌ టాక్‌, బాల బృందావనం రెండు కార్యక్రమాలను కలిపి ప్రత్యేక సెమినార్‌ను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శాంతిసరోవర్‌లోని గ్లోబల్‌ పీస్‌ ఆడిటోరియంలో నిర్వహిస్తారు.

కెరీర్‌ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బండ్లగూడ: విద్యార్థులకు విద్య ఆవశ్యకతతో పాటు నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయ శ్రీ శారదా ధామంలో రౌండ్‌ టేబుల్‌, పీఅండ్‌జీ శిక్షా హాప్పినెస్‌ అవర్స్‌ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత విద్య, తక్షణ ఉపాధి అవకాశాల్లో గల కోర్సుల గురించి అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌పై అవగాహన కల్పించామని నిర్వాహకులు పేర్కొన్నారు. పీఅండ్‌టీ శిక్షా హాప్పినెస్‌ అవర్స్‌ ప్రతినిధులు కార్తీక్‌, అంబరీష్‌, శారదా ధామం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్‌, భాగ్యనగర్‌ విభాగ్‌ కార్యదర్శి విరివింటి రవీంద్రశర్మ, కోశాధికారి మధుసూదన్‌, ప్రబంధకారిణి సభ్యులు సుదర్శన్‌రెడ్డి, ప్రధానాచార్యులు రామోజు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పుడమిని సంరక్షించుకోవాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఏజీవర్సిటీ: ప్రపంచ (మృత్తిక) నేల దినోత్సవాన్ని శ్రీకొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ ప్రశాంత్‌ మాట్లాడుతూ... జీవకోటి మనుగడ కోసం నేలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూమి పరిరక్షణతోనే నీరు, గాలి తద్వారా స్వచ్ఛమైన వాతావరణం నెలకొంటుందని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు నేల పరిరక్షణకు పాటుపడుతూ పుడమిని కాలుష్యం నుంచి కాపాడుకోవాలన్నారు. నేత ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కళాధర్‌బాబు, సీఎస్‌ఆర్‌ సంతోషిణి, లావణ్య, నిరోష, మమత, మజ్జిగ శ్రీనివాస్‌, డాక్టర్‌ జెన్ని, వేణుగోపాల్‌, పూజ, మేఘన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌లో సర్వే వివరాల నమోదు



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్‌

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను కంప్యూటర్‌లలో పొందుపరుస్తున్నారు. కాటేదాన్‌ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో ఇందుకోసం తగు ఏర్పాట్లు చేశారు. ప్రతి షిఫ్ట్‌లో 250 మంది కంప్యూటర్‌ ఆపరేటర్లు పాల్గొనేలా అధికారులు తగు చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్‌, అత్తాపూర్‌, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్‌, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలో మొత్తం 87,500 కుటుంబాల సర్వేను చేపట్టారు. సర్వే చేపట్టిన ప్రతి కుటుంబం వివరాలను కంప్యూటర్‌లో పొందు పరుస్తున్నారు. 12 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కేంద్రాన్ని రాజేంద్రనగర్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ రవికుమార్‌ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది సూచనలు, సలహాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రెండు షిఫ్ట్‌లలో ఆపరేటర్లను విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి ఆపరేటర్‌ నిత్యం 30 దరఖాస్తులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసేలా అవగాహన కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు ఆపరేటర్లకు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. చిన్నపాటి లోటుపాట్లకు సైతం తావివ్వకుండా అన్ని చర్యలు, ఏర్పాట్లు తీసుకున్నామన్నారు. 12 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నామని డీసీ వెల్లడించారు.